

అంబర్పేట్ దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బొడ్రాయి పున: ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా బొడ్రాయి ఊరేగింపులో పోచమ్మ బస్తీ నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్న దృశ్యం

హైదరాబాద్ వార్త



# చెరువుల పునరుద్ధరణపై హైడ్రా ఫోకస్

- -పూడికతీత..పెన్సింగ్..వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు చర్యలు
- -ఒక్కోదానిపై సుమారు 5కోట్ల వరకు ఖర్చు
- -మొదటగా 10చెరువుల్లో పునరుద్ధరణ పనులకు శ్రీకారం





**హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త:** నీటి వనరులైన చెరువులు కుంటలు పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా ఇప్పటికే పలు చోట్ల అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను, బిల్డింగ్‌లను నేలమట్టం చేసింది. వీటితో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో కూడా హైడ్రా ముందుండి విపత్తు సహాయక చర్యలను కూడా పర్యవేక్షిస్తుంది. ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే అక్రమార్కుల గుండెల్లో రైళ్ల పరుగెత్తే విధంగా చేయడంలో హైడ్రా సఫలమైంది. మరోవైపు హైదరాబాద్‌లో కీలకమైన చెరువుల్లో ఆక్రమణలు తొలిగించి సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. ఎన్ఆర్ఎస్ఏ( నేషనల్ రిమోట్ సెన్సింగ్ తీసిన ఫోటోలు, మ్యాప్‌లతో సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని గుర్తించి నిక్షిప్తం చేసేందుకు హైడ్రా ప్రయత్నిస్తోంది. దీంతో ఆక్రమణలు, దుర్గంధం, కాలుష్య కోరల్లో చిక్కుకున్న చెరువులకు త్వరలోనే మోక్షం కలగనుంది. మొదటి దశలో ముఖ్యంగా 10 చెరువులను కాలుష్యం లేకుండా, అందులో వ్యర్థాలు కలవకుండా అభివృద్ధి చేసేందుకు సిద్దమైంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు అందమైన పచ్చని వనాలతో పర్యాటక ప్రాంతాలుగా మార్చాలని నిర్ణయించారు. ఒక్కో చెరువుకు సుమారుగా రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరు తర హాలో ఇక్కడి చెరువులను అభివృద్ధి చేయడానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల అంబర్‌పేటలోని బతుకమ్మకుంట చెరువు ను పరిశీలించారు. అక్కడ నిర్మాణాల కూల్చ కుండా ఉన్నచెరు వును కాపాడుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు ప్రారంభించారు. అలా గే హైదరా బాద్ నగర పరిధిలో ప్రస్తుతం ఉన్న 185 చెరువులకు ఒక రూపు తేవడా నికి ప్రణాళిక ను రూపొందించింది. ముందుగా రాజేంద్రనగర్ లోని అప్పా చెరువు, మాదా పూర్‌లోని సున్నం చెరువు, నిజాంపేటలోని యెర్రకుంట, కూకట్‌పల్లిలోని నల్లచెరువు, చందా నగర్‌లోని ఈర్లచెరువు, మాదాపూర్‌లోని తమ్మిడిచెరువు, ఖాజాగూడలోని తౌతానికుంట, అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట చెరువు లను పునరుద్ధరించాలని నిర్ణయించారు ఆతర్వాత మిగతావాటిపై ఫోకస్ పెట్టనున్నారు. ఇప్పటికే పలు ఆక్ర మణల తొలగింపు..ఇప్పటికే కొన్ని చెరువుల దగ్గర హైడ్రా అధికా రులు ఆక్రమణల ను తొలగించారు. మాదాపూర్‌లోని తమ్మిడి చెరువు దగ్గర సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్‌కన్వె న్షన్ సెంటర్ భవనా లను పూర్తిగా కూల్చివేశారు. చెరువు చుట్టుప్కక్కల ఆక్రమణలను తొలగించారు. ఫేజ్1లో భాగంగా చేపట్టే చెరువు ల దగ్గర కబ్జాలో ఉన్న వారి అనుమతితో నిర్మాణాలను తొలగించి పునరుద్ధరణ చేప ట్టాలని నిర్ణయించారు.ఈ చెరువుల విస్తీర్ణం 30 ఎకరాల నుంచి 50 ఎకరాల వరకుంది. ఈ 8 చెరువుల పునరుద్ధర ణకు సుమారుగా రూ.40 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తు న్నారు . ప్రతి చెరువులో ముందుగా పూడిక తీసి ఆ మట్టితో చుట్టూ గట్లు, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తారు. నాలాల నుంచి వచ్చే వ్యర్థాలు నేరుగా చెరువులో కలవకుండా క్లీన్ చేయడానికి మినీ శుద్ధి కేంద్రాల ఏర్పాటు..ఒక చెరువులోని నీరు మరో చెరువులోకి వెళ్లేలా గొలుసు కట్టు విధానాన్ని అభివృద్ధి చేస్తారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన వెన్నెల గద్దర్



సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపుతున్న గుమ్మడి వెన్నెల గద్దర్

**హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త** నాపై ఎంతో నమ్మకంతో నన్ను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్పర్సన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనిమల రేవంత్ రెడ్డి గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు గుమ్మడి వెన్నెల గద్దర్. ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ తన పదవికి సహకరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్లమెంటు సభ్యుడు మల్లు రవి, మంత్రులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు వివేక్ వినోదు, టిటిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మల్కాజిరి పార్లమెంటు ఇంచార్జ్ సునీతా మహేంద్రారెడ్డి ఇతర కాంగ్రెస్ పెద్దలు నన్ను నా కుటుంబాన్ని అభిమానించే పార్టీ కార్యకర్తలు అందరికీ ఆమె ఆ ప్రకటనలు కృతజ్ఞతలు తెలిపారు. మా కుటుంబానికి అండదండలందిస్తున్న ఏఐసిసి అగ్రనేతలు సోనియా గాంధీ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖార్గే,కె.సి. వేణుగోపాల్, కొప్పుల రాజు జాతీయ కాంగ్రెస్ నేతలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు నాకిచ్చిన పదవికి న్యాయం చేస్తానని, తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ వృత్తి కళాకారులను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని ఆమె ఆ ప్రకటనలో హామీ ఇచ్చారు

## ప్రజావాణి విన్నపాలను సత్వరమే పరిష్కరించాలి

### -డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



ప్రజావాణిలో ఆర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి

**హైదరాబాద్ నవంబర్ 18,ప్రభాతవార్త:** ప్రజావాణి లో ప్రజల నుండి వచ్చిన విన్నపాలు వెంటనే పరిష్కారం చేయాలని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుంచి డిప్యూటీ మేయర్ స్వీకరించారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధిక ప్రాధాన్యత నివ్వలని, అర్జిదారుని సమస్యను పరిష్కారం చేయుటలో అలసత్వం చేయద్దన్నారు.అర్జీ దారునికి నిర్దేశించిన కాల వ్యవధిలో పరిష్కారం చేయాలన్నారు. ఒక వేళ పరిష్కారం చేయడంలో జాప్యానికి గల కారణాలు సమస్య పరిష్కారం కాక పోవడానికి కారణాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు కే శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, యాదగిరి రావు స్రామాట్ అశోక్, సత్యనారాయణ, వెను గోపాల్ రెడ్డి అడిషనల్ సిసిపిలు గంగాధర్, ప్రదీప్ లు విన్నపాలను స్వీకరించారు.

## రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలి

### -అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరు

**హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త:** ఈనెల 21న భారత రాష్ట్రపతి హైదరాబాద్ పర్యటన కార్యక్రమం ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పగడ్బందీగా చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో పోలీస్, ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, జిహెచ్ఎంసి తో నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హైదరాబాద్ ఎన్టిఆర్ స్టేడియంలో జరిగే కోటి దీపోత్సవం వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పాల్గొననున్నందున పర్యటన సందర్భంగా శాఖల వారీగా చేపట్టే కార్యక్రమాలపై డిసిపి సెంట్రోల్ జోన్ ఆకాంక్ష్ యాదవ్, నిర్వాహకులు లతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఎక్కడ కూడా పొరపాట్లు జరగకుండా అప్పగించిన పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి అందుబాటులో ఉంచాలని అలాగే ప్రోటోకాల్ తప్పక పాటించాలని సూచించారు. దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనే రోజున నిర్వాహకులు, శాఖల వారీగా పాల్గొనే సిబ్బంది వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ పాత్ర కీలకమని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఫైర్ టెండర్స్, ఎక్కువమంది సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్, సౌండ్ ప్రూఫ్ జనరేటర్స్, ఆర్ అండ్ బి శాఖ స్టేజ్ సర్టిఫికెట్, బ్యారిగేటింగ్,వ్యూకట్టర్ ఏర్పాటు చేయాలని, జూ పార్క్ నుండి బగ్గీలు సిద్ధంగా ఉంచాలని, జిహెచ్ఎంసి ద్వారా త్రాగునీరు, పారిశుధ్య పనులు నిరంతరం జరగాలని, పారిశుధ్య పనులకు ఎక్కువ సిబ్బందిని నియమించాలని, 5 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రీట్ లైటింగ్, లూస్ వైర్లు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ శాఖ ద్వారా ఐదు మెడికల్ స్టాల్స్ తో పాటు అంబులెన్స్, దగ్గరలో ఉన్న ఆసుపత్రులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ముఖ్యంగా స్టేజ్ ఏర్పాటు పై ఆర్ అండ్ బి శాఖ ధ్రువీకరణ చేయాలనీ సూచించారు. అనంతరం కలెక్టర్ ఎన్టీఆర్ గ్రౌండ్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ రామకృష్ణ, జిల్లా అధికారులు, పోలీస్, జిహెచ్ ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## కోటిదీపోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



కోటిదీపోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**ముషీరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న కోటిదీపోత్సవంలో పదవరోజు సోమవారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు బొగ్గగనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డి కూడా హాజరై దీపం వెలిగించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం భక్తులను ఆకర్షించింది.

## తెలంగాణ జూపార్కుల కొత్త డైరెక్టర్‌గా డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్

### నెహ్రూ జూలాజికల్ పార్కు నూతన క్యూరేటర్‌గా జె.వసంత



తెలంగాణ జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్ నుంచి పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న జూ పార్కు నూతన క్యూరేటర్ జె.వసంత

**చార్మినార్,నవంబరు 18 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు నూతన క్యూరేటర్‌గా జె.వసంత నియమితులయ్యారు.జయశంకర్ భూపాలపల్లి ఫారెస్ట్ డివిజనల్ అధికారిగా పద్దెనిమిది నెలలు పాటు విధులు నిర్వహించిన వసంత నెహ్రూ జూలాజికల్ పార్కుక్యూరేటర్‌గా బదిలీపై వచ్చారు.2016వ బ్యాచ్ ఐఎఫ్ఎస్‌కు చెందిన జె.వసంత సోమవారం జూపార్కు నూతన క్యూరేటర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.కాగా జూ పార్కు క్యూరేటర్‌గా పద్నాలుగు నెలలు పాటు పని చేసిన 2011 బ్యాచ్‌కు (ఐఎఫ్ఎస్) చెందిన డాక్టర్. సునీల్ ఎస్.హీరామత్ తెలంగాణ రాష్ట్రం జూ పార్కుల డైరెక్టర్‌గా నియమితులయ్యారు.ఇంత వరకు ఆయన అడిషనల్ డైరెక్టర్‌గా కొనసాగారు. తెలంగాణ జూ పార్కుల కొత్త డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్.సునీల్ ఎస్. హీరామత్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.జూపార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరామత్,జూపార్కు నూతన క్యూరేటర్ జె.వసంతను జూపార్కు అధికారులు,ఉద్యోగులు కలిసి అభినందనలు తెలియజేశారు.

## మియాపూర్‌లో యువతి అదృశ్యం.. తుక్కుగూడలో మృతదేహమై లభ్యం

**శేరిలింగంపల్లి, నవంబర్ 18 ప్రభాతవార్త :** నగరంలోని మియాపూర్‌లో అదృశ్యమైన యువతి (17)మృతదేహం లభ్యమైంది. తుక్కుగూడలోని ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నవంబర్ 10వ తేదిన యువతి కనిపించటంలేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ఉప్పుగూడకు చెందిన ఓ యువకుడితో సోషల్ మీడియా ప్లాట్‌ఫాం,ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాలో పరిచయమయిన ఆ యువకుడే హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబందించి ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకున్నట్లు సమాచారం.

## చెరువులు,కుంటలు కబ్జాచేస్తే సహించేది లేదు

### -హైడ్రా కమిషనర్ రంగనాథ్



రేవులకుంట,భక్షుకుంట చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**శేరిలింగంపల్లి, నవంబర్ 18 ప్రభాతవార్త** చెరువులను, కుంటలను కబ్జాచేస్తే ఎంతటివారినైనా సహించేదిలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని రేవుల కుంట చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. రేవులకుంట చెరువు కబ్జాకు గురవుతుందని స్థానిక కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు చెరువును పరిశీలించారు. చెరువు కబ్జా వివరాలను స్థానికులతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు మొత్తం చెరువు విస్తీర్ణం ఎంత, ఏ మేరకు కబ్జా జరిగింది. ఎవరు కబ్జా చేశారన్న విషయాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానికులు స్పందిస్తూ ప్రజావసరాల నిమిత్తం కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారని, హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.చెరువులు, కుంటలు ప్రైవేటు పరం కాకుండా చూడాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రజాసమస్యలపై సానుకూలంగా ప్రతిస్పందించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువు,కుంటలు కబ్జా కాకుండా చూడాలని స్థానిక హైడ్రా అధికారులకు ఆదేశించారు. చెరువులతో పాటు వివిధ కాలనీల్లో పార్కుల కోసం, ఇతర ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలలను హైడ్రా కాపాడుతుందని రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి చెరువుల కబ్జాలపై పిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా భక్షుకుంట,రేవులకుంట చెరువుల కబ్జాల వ్యవహారంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదన్నారు. ఖచ్చితంగా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామ న్నారు.రేగులకుంట చెరువులో నీటి స్వచ్ఛత గురించి హైడ్రా కమిషనర్ స్థానికులతో చర్చించారు. చెరువుల్లోనికి మురుగు నీరు చేరకుండా మళ్లించిన తీరును ఆయన దగ్గరుండి పరిశీలించారు. తక్కువ ఖర్చుతో రెండు చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్దంగా పనిచేస్తామని ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, కాలనీ వాసులు, చెరువుల పరిరక్షకులు ఆనంద్‌మల్లిక్ గవాడ్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, సీపీఎం నాయకుడు శోభన్, కృష్ణ, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నష్టాల్లో హైదరాబాద్ మెట్రో రైలు

### - మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి

### -కేంద్రం నుంచి అనుమతులు రాగానే రెండో దశ పనులు




ఏజీ కార్యాలయంలో ఆడిట్ వారోత్సవాలు ప్రారంభిస్తున్న మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త** హైదరాబాద్ మెట్రో రైలు వల్ల నిర్మాణ సంస్థ ఎల్‌అండ్ టీకి రూ.6వేల కోట్ల నష్టం వాటిల్లిందని, ప్రతి ఏడాదికి రూ.1300 కోట్లు నష్టపో తుందని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపా రు. అందువల్లే ఆ సంస్థ రెండో దశ నిర్మాణానికి ముందుకు రాలేదని, ఎల్ అండ్ టీకి వాటిల్లుతున్న నష్టంతో మరే ఇతర ప్రైవేటు సంస్థలు కూడా మొగ్గు చూపడం లేదని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని అడిట్ జనరల్ కార్యాలయంలో నిర్వహించిన ఆడిట్ వీక్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్‌లో మెట్రో రైలు ప్రస్థా నాన్ని గుర్తు చేశారు. రెండో దశ నిర్మాణానికి సంబంధించి 76 కిలో మీటర్ల మార్గానికి రూ.24,269 కోట్లలతో ప్రతి పాదనలు సిద్ధం చేశామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆ నిర్మాణం జరుగుతుందని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, కేంద్రం నుంచి అనుమతులు రాగానే రెండో దశ పనులు ప్రారంభిస్తామని వివరంచారు. హైదరాబాద్ ప్రజల సహకారంతో రెండో దశను కూడా పూర్తి చేస్తామని తెలిపారు.హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశపై సీఎంతో సుదీర్ఘంగా చర్చించాం. రెండో దశలో 76 కి.మీ మెట్రో రైలు నిర్మాణం చేపడుతున్నాం. మెట్రో రైలు రెండో దశ నిర్మాణం చాలా సవాళ్లతో కూడుకున్నది. మెట్రో రైలు రెండో దశకు ప్రైవేటు సంస్థలేవీ ముందుకు రాలేదు. మెట్రో రైలు మొదటి దశలో ఎల్ అండ్ టీ సంస్థకు భారీగా నష్టం వాటిల్లింది. ఎల్ అండ్ టీ అనుభవంతో ప్రైవేటు సంస్థలేమీ ముందుకు రావడం లేదు. మొదటిదశ మెట్రో వల్ల ఎల్ అండ్ టీ సంస్థకు రూ.6 వేల కోష్టం. మెట్రో వల్ల ఎల్ అండ్ టీ సంస్థ ఏడాదికి రూ.1300 కోట్లు నష్టపోతుంది. మిగతా రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలే మెట్రో రైలును నిర్వహిస్తు న్నాయి. బ్యాంకులు కూడా మెట్రో రైలు నిర్మాణానికి అప్పులు ఇచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు.మిగతా రాష్ట్రాల తరహాలోనే ప్రభుత్వమే మెట్రో రైలు నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. జాయింట్ వెంచర్ విధానంలో మెట్రో చేపడితే బాగుంటుందని ముఖ్యమంత్రికి సూచిం చానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం కలిసి ఐదు కారిడా ర్లను చేపట్టబోతున్నాయని అన్నారు. ఈ మార్గానికి రూ.24,269 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామ న్నారు. 30 శాతం రాష్ట్రం, 18 శాతం కేంద్రం. మిగిలిన 48 శాతం జైకా లేదా ఇతర సంస్థల ద్వారా నిధులు సమకూరుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదందో కేంద్రానికి ప్రతిపా దనలు పంపినట్లు తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతామని అన్నా రు. భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆడిట్, అకౌంట్స్ శా ఖ పాత్ర చాలా కీలకమమని ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. ప్రజాధనం పూర్తి సద్వినియోగం అవ్వడంతో పా టు వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న వ్యయాన్ని తగు విధంగా పరిశీలించే లక్ష్యంతో పని చేస్తు న్న సీఏజీ, ఈ వారోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కలిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థికం గా అభివృద్ధి సాధిస్తున్న దశలో అనేక సవాళ్లు ఎదురవుతాయని వాటిని సమర్థంగా ఎదుర్కొనే యం త్రాంగాన్ని అన్ని విభాగాల్లో సన్నద్ధం చేయాలనీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు.ఆడిట్ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో రీజినల్ కెపాసిటీ బిల్డింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ సి.శైలజ, తెలంగాణ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్ (సెంట్రల్) హేమ ముని వెంకటప్ప, అకౌంటెంట్ జనరల్ ఆడిట్ పి.మాధవి, ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ఆడిట్ వి.ఎం.వి.నావల్ కిషోర్ పాల్గొన్నారు

## నిజాయితీ చాటుకున్న యువకుడు



రూ.2 లక్షల నగదును ఎస్సై షాహిద్‌కు అందజేస్తున్న సతీష్ యాదవ్, కిషోర్ యాదవ్

**తార్నాక, నవంబర్ 18 ప్రభాతవార్త:** రోడ్డుపై దొరిగిన రూ. 2లక్షలను ఓ యువకుడు పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. ఈ సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధి లోని లాలాపేట్‌లో జరిగింది. లాలాపేట్‌కు చెందిన సతీష్ యాదవ్ సోమవారం లాలాపేట్ అయ్యప్పగుడి వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్లుతున్నాడు. రోడ్డుపై అతనికి రూ. 2లక్షలు కనిపించాయి. దీంతో ఆయన వెంటనే స్థానిక కాంగ్రెస్ నాయకుడు కిషోర్ యాదవ్‌కు ఈ విషాయాన్ని తెలియజేశాడు. దీంతో వారిద్దరు కలిసి లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సై షాహిద్‌కు అప్పగించారు. వారిద్దరిని ఇన్స్‌పెక్టర్ కలమల రఘు బాబు, ఎస్సై షాహిద్ అభినందించారు.

## బస్తీలలో కార్పొరేటర్ పాదయాత్ర



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 18 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సోమవారం అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని దుర్గానగర్, లక్ష్మీగూడ, బృందావన్ కాలనీ ప్రాంతాలలో పర్యటించారు. స్థానిక బస్తీ వాసుల ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బస్తీలలో కొత్త సిసి రహదారులు, డ్రైనేజీ పైపు లైన్లు వేయనున్నామని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికే జనార్దన్, వాటర్ వర్క్స్ మేనేజర్ రేణుక, జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి, జిహెచ్ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ బిజెపి నాయకులు, స్థానికులు జనార్దన్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, శ్రావణ్ కుమార్, హనుమంత్ రెడ్డి, ధన్‌రాజ్, సతీష్, రంజిత్‌లు పాల్గొన్నారు.

## పోయిన సెల్‌ఫోన్లను సులభంగా సంపాధించుకునేదే సిఇఐఆర్ యాప్

### -బాలానగర్ డిసిపి సురేశ్‌కుమార్



సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాదితులకు వారివారి ఫోన్లను అందజేస్తున్న బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ కె.సురేశ్‌కుమార్, అడిషనల్ డిసిపి సత్యనారాయణ, జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్

**కుత్బుల్లాపూర్, నవంబరు 18 ప్రభాతవార్త :** అనివర్య కారణాల వల్ల సెల్‌ఫోన్‌లు పోయినా దొంగిలించబడ్డా సిఇఐఆర్ యాప్‌ద్వారా త్వరలోనే పొందే అవకాశం వుందని బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ కె.సురేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం బాలానగర్ డిసిపి కార్యాలయంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 28 మంది సెల్‌ఫోన్ బాదితులను గుర్తించి వారికి వారివారి సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఈసందర్బంగా బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ కె.సురేశ్ కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోయినా, దొంగిలించ బడ్డా కంగారు పడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు సిఇఐఆర్ యాప్‌ద్వారా ఫిర్యాదు చేస్తే ఫోన్ ఎక్కడ ఉన్న యాప్ ద్వారా కొత్త టెక్నాలజీ ద్వారా గుర్తించి పొందవచ్చునన్నారు. జీడిమెట్ల పోలీసులు ప్రత్యేకశ్రద్దతో యాప్‌ద్వారా ఒక ప్రత్యేక కానిస్టేబుల్ కె.రవినాయక్‌ను నిమించి అందిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేసి సుమారు ఐదు లక్షల రూపాయల విలువగల 28 మెబాయిల్ ఫోన్లను రాబట్టి బాదితులకు అందజేసినట్లు తెలిపారు. ఈవిషయంలో ప్రత్యేకశ్రద్ద కనబర్చి రికవరీ చేసిన రాజునాయక్‌ను డిసిపి సురేశ్‌కుమార్ అభినందించి సత్కరించారు. బాలానగర్ అడిషనల్ డిపిపి సత్యనారాయణ, డిటెక్టూ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ కనకయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్యులు ఐక్యతను చాటాలి : నాంపల్లి విజయ్‌గుప్తా**

**కుత్బుల్లాపూర్, నవంబరు18 ప్రభాతవార్త :** సమాజంలో అన్ని వార్గలను సమానంగా చూస్తూ అందరి సంక్షేమాన్ని కోరుకునే ఆర్యవైశ్యులు సంఘటితంగా సమాజసేవలో భాగస్వాములు కావాలని చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి నాంపల్లి విజయ్ గుప్తా విజ్ఞప్తిచేశారు. ఆర్యవైశ్య కార్తీక వనభోజన ముగింపు సమావేశం చింతల్ రంగానగర్ కాలనీలో అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్బంగా నాంపల్లి విజయ్‌గుప్తా మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ చింతల్ పరిధిలో నిర్వహించిన వనభోజనాలకు కేవలం వాట్సప్‌మెసేజ్‌ల ద్వారా సమాచారం అందించినా వందలాది మహిళలు, పురుషులు, పిల్లాపాపలతో హజరై తమ ఐఖ్యత చాటడం ప్రతిఒక్కరిలో ఉన్న చైతన్యానికి నిదర్శనమన్నారు. అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా మాట్లాడుతూ ఏ విలువైన సమాచారం ఫోన్‌ద్వారా అందించినా ఇలాంటి స్పదన ప్రతిఒక్కరినుండి ఆశిస్తున్నామని తెలిపారు. ఈసందర్బంగా వైశ్య లయన్స్ ప్రతినిధులు చింతల ఉమాశంకర్‌గుప్త పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

**చార్మినార్, నవంబరు 18 ప్రభాతవార్త :** గుర్తు తెలియని డబ్బై సంవత్సరాలు వయస్సు గల ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ కథనం ప్రకారం... ఈ నెల 12వ తేదీన పాతబస్తీ పురానాపూల్ శ్మశాన వాటిక వద్ద గుర్తు తెలియని 65 నుంచి 70 సంవత్సరాలు వయస్సు గల వృద్ధురాలు కొన ఊపిరితో పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకని వృదురాలిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వృద్ధురాలు మృతి చెందినట్లు డాక్టర్లు ధృకరించారు. వృద్ధురాలి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురిలో భద్రపరిచారు. గుర్తు తెలియని వృధ్దురాలు శరీరంపై పింక్ కలర్ చీర ఉంది. హిందువు అయి ఉండ వచ్చునని పోలీసులు భావి స్తున్నారు. ఈ కేసును కామాటిపుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## స్ఫూర్తివంతంగా 'న్యాయవాదుల సహకార సంఘం' సేవలు

**హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త**


న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధికి బాటలు వేస్తున్న న్యాయవాదుల సహకార సంఘం సేవలు స్ఫూర్తివంతంగా ఉన్నాయి. న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘం 1999 నవంబర్ 19వ తేదీన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో 125 మంది సభ్యులతో ఆవిర్భావించింది. న్యాయవాదుల సహకార సంఘంలో నేడు 4924 మంది సభ్యులతో కొనసాగుతోంది. క్రమంగా తన శాఖలను నాంపల్లి క్రిమినల్ కోర్టు, సికింద్రాబాద్ సివిల్ కోర్టు, మనోరంజన్ స్పెషల్ కోర్టు, రంగారెడ్డి జిల్లా కోర్టు, మల్కాజ్గిరి కోర్టు, రాజేంద్రనగర్ కోర్టు, మనోరంజన్ ప్రత్యేక కోర్టు, హయత్ నగర్ కోర్టు, ఇబ్రహీంపట్నం కోర్టు, వికారాబాద్ కోర్టు, షాద్నగర్ కోర్టు, మేడ్చల్ కోర్టులకు విస్తరించి పోస్టల్ స్టాంపులు, నోటరీ స్టాంపులు, స్టేషనరీ, ఫిక్స్డ్ డిపాజిట్ల జారీ, జ్యూడిషియల్, నాన్ జ్యూడీషియల్, స్టాంప్ పేపర్లు విక్రయిస్తూ న్యాయవాదులకు, కక్షిదారులకు గత 25 సంవత్సరాలుగా ఉత్తమ సేవలను అందిస్తున్నది. న్యాయవాదుల సహకార సంఘం సభ్యులతో పాటు వారి కుటుంబంలోని ఒక వ్యక్తి ప్రతి సంవత్సరము 2.5 లక్షల రూపాయల ఉచిత మెడిక్లేమ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నది. సభ్యుడు మృతి చెందితే దహన సంస్కారాల కోసం వెంటనే 50వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేస్తుంది. సభ్యులది సహజ మరణం అయితే జీవిత బీమా ద్వారా 7 లక్షల రూపాయలు, ప్రమాదవశాత్తు మరణిస్తే 15 లక్షల రూపాయలను సభ్యుల తరఫున నామినీకి అందజేసున్నది. రోజూ కోర్టు కేసులతో ఒత్తిడికి గురవుతూ తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తున్న న్యాయవాదుల కోసం కోర్టు వద్ద వైద్య సహాయం అందించాలనే ఉద్దేశంతో సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్ కోర్టు, నాంపల్లి క్రిమినల్ కోర్టు, రంగారెడ్డి జిల్లా కోర్టులలో అడ్వకేట్ క్లినిక్ లను ఏర్పాటు చేసింది. ప్రతిరోజు అలోపతి, హోమియోపతి వైద్యులు అందుబాటులో ఉంటూ న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షిదారులు, పోలీసులు, కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య సేవలు అందిస్తూ న్యాయవాదల సహకార సంఘం అందరి మన్ననలను పొందుతున్నది.

## గౌరీశంకర్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం

**: కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, నవంబరు18 ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాలకోసం పరితపించే బుడ్డా గౌరీశంకర్‌గౌడ్ మరణం తీరని లోటని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ గౌడ సంఘ అధ్యక్షులు బుడ్డా గౌరీశంకర్‌గౌడ్ ఆకాల మరణంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ కె.పి.వివేకానంద్ పరామర్శించారు. ఈసందర్బంగా వివేకానంద్ మాట్లాడుతూ సౌమ్యుడుగా, సేవాతత్పరుడుగా గౌరీశంకర్‌గౌడ్ స్థానికంగా మంచిగుర్తింపుతెచ్చుకున్నారని తెలిపారు. కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ తన డసోదరుడుగానే కాక ప్రతిఒక్కరి హృదయాలను దోచుకున్న వ్యక్తిగా గౌరీశంకర్‌గౌడ్‌కు గుర్తింపు ఉందన్నారు. సోమవారంచింతల్ చంద్రానగర్ కాలనీలోని ఆయన నివాసం నుండి కుత్బుల్లాపూర్ గ్రామసమీపంలో గల స్మశానవాటికకు భారీగా తరలివచ్చిన అభిమానుల మద్య గౌరీశంకర్‌గౌడ్ అంత్యక్రియలు ముగిసాయి.

## ఘనంగా అయ్యప్పమహాపడి పూజ



పడిపూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు పి.మమత సంతోష్‌గుప్త

**బేగంబజార్, నవంబర్ 18ప్రభాతవార్త:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అయ్యప్ప స్వాములు మాల దారణం చేసిన కృష్ణస్వామి, బాస్కర్‌స్వామి ఆశ్రమంలో అయ్యప్పస్వామి మహాపడి పూజను భక్తి శ్రద్దల మధ్య నిర్వహించారుమహా అయ్యప్పమహాపడి పూజ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.సంతోష్‌గుప్త, మాజీ కార్పొరేటర్‌పి.మమతసంతోష్‌గుప్తలు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వాములు స్వామి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం స్వాములతోపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**బేగంబజార్, నవంబర్ 18ప్రభాతవార్త:** సుల్తాన్‌బజార్ 11 కెవి విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా మంగళవారం ఉదయం10గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ సిబిడి ఎ.డి.ఇ వెంకటేశ్వర్లు తెలిపారు. సుల్తానబజార్, ప్రగతికళాశాల, హన్‌మాన్‌టేకిడి, తారకరామా 11కెవి విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను శాలిమార్‌పంక్షన్‌హాల్, జాగృతి కళాశాల, రామ్‌కోఠి ఎక్స్‌రోడ్డు తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. కాగా 11కెవి రాంకోఠి పరిధిలో మధ్యాహ్నం 3గంటలనుంచిసాయంత్రం 5గంటల వరకు ఎసిపి కార్యాలయం, బాలాజీ దాబా, శ్యాం శ్రీబాగ్, కాచిగూడబిగ్‌బజార్, తారకరామాథియేటర్, మహాంకాళీదేవాలయం తదితర ప్రాంతాలు, 11కెవి మహేశ్వరి, పరమేశ్వరి ఫీడర్లపరిధిలో మధ్యాహ్నం3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు వెంకటేశ్వర కాలని తదితరప్రాంతాలల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని బేగంబజార్ సిబిడి ఎ.డి.ఇ వెంకటేశ్వర్లు తెలిపారు.

**శారదా కళాశాల ఫీడర్ పరిధిలో...**

**చార్మినార్, నవంబరు 18 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 19వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు శారదా కళాశాల ఫీడర్ పరిధిలో, 12 నుంచి 2 గంటలు వరకు కేశవగిరి, పోలీస్ క్వార్టర్స్ ఫీడర్ల పరిధులలో, నీలమ్ సెంటర్ పరిధిలో 12 నంచి 1 గంట వరకు, జమాలబండ, అలియాబాద్ ఫీడర్ల పరిధులలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఫలక్‌నుమా సిబిడి అధికారులు తెలిపారు. కాజీపురఫీడర్ పరిధిలో 10.30 నుంచి 1 గంట వరకు, చందూలాల్ బారాదరి ఫీడర్ పరిధిలో 2 నుంచి 5వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయను న్నామని చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అక్బర్ తెలియజేశారు.

**11కేవీ సాయినగర్ ఫీడర్‌లో...**

**నిజాంపేట్, నవంబర్ 18, ప్రభాతవార్త:** 11కేవీ సాయినగర్ ఫీడర్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు సాయినగర్ కాలనీ, ఆర్‌జికె ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.

**ప్రశాంతి హిల్స్ సబ్‌స్టేషన్‌లో..**

33/11 కేవీ ప్రశాంతి హిల్స్ సబ్‌స్టేషన్ నుండి 11 కేవీ బృందావన హిల్స్ ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుండి 4.30 గంటల వరకు బృందావన హిల్ కాలనీ, గ్రీన్ ఫీల్డ్, రాజధాని స్కూల్, బండారి లేఅవుట్ రోడ్ నెంబర్ 10, 10ఏ, సిద్దప్ప బస్తీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ ఏఈ తెలిపారు.

**జూబ్లీహిల్స్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం..**

**పంజగుట్ట, నవంబర్ 18 (ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్‌లోని గురుబ్రహ్మనగర్‌లో ఓ ఇంటిలో పవర్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలు పెద్దఎత్తున లేవడంతో చుట్టుపక్కల మూడు ఇళ్ళు పూర్తిగా దగ్ధం కావడంతో పాటు రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. స్థానికులు పోలలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నార్సింగిలో జరిగిన అయ్యప మహాపడి పూజలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత జెల్లి వెంకటేష్, తదితరులు

## ఎన్నారై, సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో పశువైద్య విద్యలో సీట్ల ఖాళీలు

**అత్తాపూర్ నవంబరు18, ప్రభాతవార్త :** పివి నరసింహ రావు పశువైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని రాజేంద్రనగర్ మరియు కోరుట్ల పశువైద్య కళాశాలలో పశువైద్య విద్యలో ఎన్నారై, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద 7 సీట్లు ఉన్నాయని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ కళాశాలలో 1 ఎన్నారై, 1 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు, కోరుట్ల కళాశాలలో 3 ఎన్నారై, 2 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయని తెలిపారు. పశువైద్య విద్య అభ్యసించిన విద్యార్థులకు దేశంలోనే కాకుండా విదేశాలలో ఉజ్వల భవిష్యత్తు కలదని తెలిపారు. ప్రవేశం కోసం రుసుం, తదితర వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని ఆసక్తి కలిగిన అభ్యర్థులు రాజేంద్రనగర్ గల విశ్వవిద్యాలయ పరిపాలన భవనానికి వచ్చి దరఖాస్తు ఫారం, రుసుం దృవీకరణ సెర్టిఫిక్ట్, కళాశాల ఫీజు డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా ఈ నెల 25వ తేదిన నేరుగా హాజరుకాగలరని తెలిపారు.

## చార్మినార్ వద్ద గంజాయి బ్యాచ్ హల్ చల్..!

### -నడిరోడ్డుపై కర్రలతో ఒకరిపై ఒకరు దాడి

### -భయాందోళనకు గురైన వాహనదారులు

**హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త**

చార్మినార్ వద్ద నడిరోడ్డుపై గంజాయి బ్యాచ్ హంగామా సృష్టించారు. ఉదయం నడిరోడ్డుపై కర్రలతో ఒకరి పై ఒకరు దాడి చేసుకుంటూ హల్ చల్ చేశారు. ఒకరి నొకరు పట్టుకుని తూగుతూ.. కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో వాహనదారులు గంజాయి బ్యాచ్ ను ఆపడానికి ప్రయత్నించినా వారిని కూడా నెట్టివేశారు. ఈ ఘటనతో అక్కడ భయాందోళన వాతావరణం నెలకొంది. నడిరోడ్డుపై ఇద్దరు వ్యక్తులు కట్టెలతో కొట్టుకోవడంతో వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. నడిరోడ్డు పైనే దాడికి దిగడంతో వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటపాటు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడిరోడ్డుపై గంజాయి సేవించి ఇలా నానా రచ్చ చేయడం ఇది మొదటి సారి కాదని, ఇలా వీకెండ్ లో కూడా జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడని వాపోయారు. శని, ఆదివారాలే అనుకుంటే ఇప్పుడు సోమవారం ఉదయం నుంచే గంజా బ్యాచ్ ఆగడాలకు హద్దులేకుండా పోయాయని మండిపడుతున్నారు. నడిరోడ్డు పై ఉన్నామనే భయం కూడా లేకుండా.. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్న పట్టించుకోకుండా.. ఇలా ప్రవర్తిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మద్యం సేవించి రోడ్లపై పోలీసు పిల్లల వీరంగం

### -కేసులు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు

**పంజగుట్ట, నవంబర్ 18 (ప్రభాతవార్త):** అతిగా మద్యం సేవించడమే కాక ర్యాష్ డ్రైవింగ్ చేయడం, అడ్డువచ్చిన వారిని దుర్భాషలాడడం చేసిన యువకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం. యాచారంకు చెందిన గోవింద్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోను శ్రీనగర్‌కాలనీలో ఓ మెడికల్ షాపుముందు నిలిపి షాపులోకి వెళ్ళాడు. బయటకు వచ్చి చూసేసరికి కొందరు యువకులు కారులో వచ్చి వెనుక నుండి వేగంగా ఢీకొట్టారు. ఆటోతో పాటు గోవింద్‌కు గాయాలవ్వగా అక్కడే పార్క్ చేసి ఉన్న మరో రెండు ఆటోలు, ఓ కారును కూడా ఢీకొనడంతో అవి కూడా స్వల్పంగా ధ్వంసమయ్యాయి. కారులోంచి ఐదుగురు యువకులు దిగి వాహనదారులపైనే తిరగబడ్డారు. వారు పూర్తిగా మద్యం మత్తులో ఉన్నారు. ఇదేమని అడిగిన స్థానికులపై తిరగబడి తాము పోలీసుల పిల్లలమని బెదిరించారు. జనాలు పెరగడంతో సంఘటనాస్థలం నుంచి మెల్లగా జారుకుని వెళ్ళిపోయారు. దీంతో బాధితులు ఈ విషయమై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి**

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 18 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..... పాత కర్నూల్ రోడ్డులో సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే సమయంలో రహదారి మీదుగా వెళుతున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వాహనదారుడు మృతి చెందాడు. మృతుడు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

### -ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్



ట్రాఫిక్ ఉల్లంఘన దారలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ అడిషినల్ కమీనర్ విశ్వప్రసాద్.

**బేగంపేట నవంబరు 18, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ,రోడ్డు ప్రమాదాలకు కారణం అవగాహనా రాహిత్యం అని ట్రాఫిక్ అడిషినల్ కమీషనర్ పి.విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం టీటీఐ బేగంపేట ప్రాంగణంలో ట్రాఫిక్ ఉల్లంఘన దారులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో విశ్వప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని రోడ్డు ప్రమాదాలు మరియూ నివారణ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం నేరం కాదని, అనుకోకుండా జరిగే ప్రమాదం అని అన్నారు. చాలా మందికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్ మీద ఫుట్‌ఫాత్ లేనపుడు కుడి వైపున మాత్రమే నడవాలన్నారు. దాని వల్ల ఎదురు వచ్చే వాహనాలను గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపరాదన్నారు. మద్యం సేవిస్తే ఆటో లేదా ఏదైనా ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో వెళ్లాలని తెలియజేసారు. దాని వలన వారు మరియూ వారి కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉంటారన్నారు. మద్యం మానివేయడం చాలా మంచిదని దాని వలన కుటుంబం మరియూ సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ ద్వారా మాత్రమే కాకుండా అవగాహన కార్యక్రమాలు ద్వారా కూడా ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడికి ట్రాఫిక్ నియమాలు తెలిసి ఉండాలన్నారు. దీని వల్ల రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. సర్టిఫికెట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 250మంది ట్రాఫిక్ ఉల్లంఘనదారులు నార్త్‌జోన్ ఏసీపీ జి.శంకరరాజు, బేగంపేట ట్రాఫిక్ టీటీఐ ఇన్స్‌పెక్టర్ వి.రామ్ చందర్, బేగంపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పాపయ్య, సిబ్బంది ఆయాన్, కృష్ణ, హీరో మోటార్స్ మేనేజర్ సాధిక్ సాగర్, సూపర్‌వైజర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల ఘటనపై ఓ.యూలో నిజ నిర్ధారణ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.చంద్రునాయక్.. చిత్రంలో సంజీవ నాయక్ తధితరులు

**తార్నాక, నవంబరు 18 ప్రభాతవార్త:** లగచర్ల ఘటనపై ఓ.యూలో సోమవారం సాయంత్రం నిజ నిర్ధారణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. లగచర్ల ఫార్మా భూముల సేకరణలో గిరిజన రైతులపై పెట్టిన కేసులు, కలెక్టర్ పైనా దాడి, లంబాడి మహిళలపై పోలీసులు అసభ్యంగా ప్రవర్థించిన తీరుపై నిజనిర్ధారణ కమీటి ఈ నెల 20న దాడి జరిగిన గ్రామంలో పర్యటించనుందని సేలవాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజనిర్ధారణ కమిటీలో పౌర హక్కుల సంఘంతో పాటు అన్ని గిరిజన సంఘాలు జేఏసీగా ఏర్పాటు అయిన బృందం లచగర్ల గ్రామానికి వెళ్లనున్నట్లు చెప్పారు. మహావీర్ హాస్పిటల్ వద్ద అందరు సమావేశమై ప్రభుత్వ బృందానకి ఎలాంటి అటంకం లేకుండా వెళ్లనున్నట్లు చెప్పారు. బంజార బిడ్డలైన ఎంపి బలరాం నాయక్, ఎమ్మెల్యే రామచంద్రనాయక్, బాలునాయక్ తధితరులు ధాడిని ఖండించకపోవడం ధారుణమని ఎంతో బాధకల్గిస్తుందన్నారు. గిరిజనులకు అక్కడ 200 ఎకరాలు ఉంది, 300 ఎకరాలే ఉందని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గిరిజన భూములను లాక్కోవడం రాజ్యాంగ విరుద్దం అన్నారు. పోలీసులు గిరిజన మహిళలపై అసభ్యంగా ప్రవర్థించడాన్ని తాము తీవ్రంగా పరిగనిస్తున్నామని చెప్పారు. ఈ దాడిపట్ల ఖండించాల్సింది పోయి కొంత మంది ప్రభుత్వాన్ని సమర్థించే భజన కమిటీలుండటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఓ.యూ ప్రొ.చంద్రునాయక్, విధ్యార్థి సంఘాల నాయకులు శ్రీనునాయక్, నిరుద్యోగ జేఏసీ నాయకులు మోతిలాల్ నాయక్, ఓ.యూ ఈశ్వర్ లాల్ నాయక్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

## నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హైదరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:** విద్యుత్ మరమ్మతుల్లో భాగంగామంగళవారం పలు ప్రాంతాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సైఫాబాద్ డివిజన్ -1 ఏడీఈ వినోద్‌కుమార్ ఓప్రకటనలో తెలిపారు. 11కెవి మెయింటనెన్స్, ఎబి స్విచ్చెస్, ట్రీ కటింట్ వర్క్స్, మరమ్మతు పనుల చేపట్టనున్నట్లు తెలిపారు. జెడ్పీ ఆఫీస్ సబ్‌స్టేషన్ పరిదిలో బంజారా అవెన్యూ 11కెవి ఫీడర్ పరిధిలోని సరస్వతి శిశుమందర్ ఎదురుగా, నవీన్ నగర్ ఏరియా, బంజారా అవెన్యూ గల్లీ, ఆనంద్‌నగర్ మజీద్ , హరీష్ మనిషన్ గల్లీ, కిష్టోఫర్‌స్కూల్, ఇంద్రలోక్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నారు. అలాగే ఎర్రమంజిల్ పద్మావతి ఫీడర్ పరిధిలోగల భగత్‌సింగ్ స్టాచ్యూ, డిటిఆర్, పద్మావతినగర్, పోస్ట్ ఆఫీస్, మోర్ సూపర్‌మార్కెట్ లైన్, పద్మావతి నగర్ చమాన్, శివాజీ స్టాట్యూ ఏరియాల్లో మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు అంతరాయం కొనసాగనుంది. అలాగే హైదర్‌గూడ కింగ్‌కోఠి పరిధిలోని కింగ్‌కోటి హాస్పిటల్, ఎస్.టి జోసఫ్ రోడ్, పార్థగేట్ ఏరియా, మ్యూజిక్ కాలేజీ ప్రాంతాల్లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నారు. అలాగే విటల్‌వాడీ తాజ్‌మహన్ ఫీడర్ పరిధిలోని మేఘనా కోర్ట్‌లైన్, తాజ్ మహల్ రోడ్, కింగ్ కోటి సర్కిల్, ఫెర్నాండెజ్ హాస్పిటల్ లైన్, గన్‌ఫ్రాండ్రీ స్ట్రీట్‌నెంబర్ 3, సూర్యలోక్ చర్చ్ కాంపౌండ్ ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు సరఫరా నిలిపివేయనున్నారు.

అలాగే విటల్‌వాడీ కామినినేని ఫీడర్ పరిధిలో బొగ్గుల కుంట వాటర్ వర్క్స్, కామినేని హాస్పిటల్ ఏరియా, ఫెర్నాండో హాస్పిటల్ ఏరియాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు సరఫరా నిలివేయనున్నారు. అలాగే నిజాంకా లేజీ సబ్‌స్టేషన్ పరిధలో శాంతాభాయ్ నర్సింగ్‌హోమ్ ఫీడర్ పరిధిలోని సంతోష్ సప్నాటాకీస్ , ఆబిడ్స్‌మెయిన్‌రోడ్, శాంతాబాయి నర్సింగ్ హోమ్ ఏరియా, ముబారక్ బజార్ ఏరియా, ఎంసిహెచ్ ఆఫీస్, హైదరాబాద్ కలెక్టరేట్ ఏరియాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

## వీరభద్రస్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం

**బేగంపేట నవంబరు 18, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం శ్రీవీరబధ్రస్వామి దేవస్థానంలో శివునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మరియూ లక్ష బిల్వార్చన పూజ ,చేసారు. ఈ పూజలో కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు శివలింగం, త్రిశూలం, స్వస్తిక్ వివిధ రకాలైన ఆకారంలో పూలతో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మహిళలు ప్రమిదలతో కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో ఆలయం మొత్తం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని వివిధ రకాలైన పూలు, వివిధ రకాలైన విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేసారు.



.కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం.

## ప్లాస్టిక్ భూతాన్ని నివారించండి

### -ఆదర్శ కాలనీలో వ్యర్థాల డంపింగ్ పై స్థానికుల ఆందోళన

**అత్తాపూర్ నవంబరు18, ప్రభాతవార్త :** వాతావరణానికి ,పర్యావరణానికి ముంపు కల్పించే ప్లాస్టిక్ పరిశ్రమలు రాజేంద్రనగర్ సర్కిల్‌లో విచ్చలవిడిగా పెరుగుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టిక్ భూతాన్ని నివారించడానికి అధికారులు కృషి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారి చేస్తున్నప్పటికి వాటిన్ని అమలు చేయడంలో రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. సర్కిల్ పరిధిలోని ఆదర్శ కాలనీలో ఓ ప్లాస్టిక్ పరిశ్రమ వలన వస్తున్న తీవ్ర సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. 60 ఫిట్ల రోడ్డు పక్కన ఉన్న ఈ పరిశ్రమలో ఆసుపత్రి వ్యర్థాలను ఇతర వ్యర్థాలను తరలించి రాత్రి పగలు నిరంతరం అక్కడ శుద్ధి చేస్తుండటంతో పరిసర ప్రాంతంలో దుర్గంధం వ్యాపిస్తుందని వాపోతున్నారు. దుర్గంధం కారణంగా, ఆదర్శ కాలనీలోని ప్రజలు అనేక రోగాల భారిన పడుతున్నామని ఈ విషయంపై గత ఐదు నెలలుగా సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వారు నోటసులు ఇవ్వడమే తప్ప ఈ పరిశ్రమపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యజమాని మాత్రం అధికారులపై ప్రభావం చూపించి పరిశ్రమను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని కాలనీవాసులు హెచ్చరించారు.



## సమగ్ర సర్వేను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

**అత్తాపూర్ నవంబరు18, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ ఎన్యుమరేటర్, ఇబి సూపర్‌వైజర్‌తో కలిసి ఎస్ఈఈఈపిసి సర్వే సమాచారాన్ని కోరారు. ఈ సందర్భంగా సర్వే పై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పలు సూచనలు చేశారు. అనంతరరం ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రజలకు అర్థమయ్యే విధంగా అధికారులు వివరించి వారిన్ని సమాచారాన్ని నమోదు చేసుకోవాలని సర్వేలో ఎలాంటి పోరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



మెరుగైన వైద్యానికి ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,నవంబర్ 18 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. బోయిన్‌పల్లికి చెందిన రాజయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి ప్రజలు ఎదురైనా వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

## ప్రభుత్వంపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత శ్యామ్‌సన్ రాజు తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 18 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామక్రిష్ణ రాష్ట్ర ప్రభుత్వం,సిఎం రేవంత్ రెడ్డి,జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లపై అనుచిత వాఖ్యలు చేస్తే కంటోన్మెంట్‌లో తిరుగనివ్వమని, ఆర్.కె. ఇల్లును ముట్టడిస్తామని 2వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత శ్యామ్‌సన్ రాజు హెచ్చరించారు. సోమవారం 2వ వార్డులోని అన్నా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనం లో ఉన్న కంటోన్మెంట్ బోర్డులో నామినేటెడ్ పదవిని కాపాడుకునేందుకు ఢిల్లీకి తరుచుగా వెల్లడం తప్పా ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు.బోర్డు మెంబర్ రామక్రిష్ణకు వర్కు అర్డర్ చూసుకోకుండా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై, రాష్ట్ర ప్రభుత్వంపై అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి : లక్ష్మణ్



జీడిమెట్ల డిపో ముందు కరపత్రాలను పంపిణీ చేస్తున్న కీలుకాని లక్ష్మణ్

**జీడిమెట్ల, నవంబర్ 18, ప్రభాతవార్త**

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నేడు జరగబోయే డిపోల ముందు ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ, జీడిమెట్ల డిపో ముందు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలైన పిఎఫ్, ఎస్‌బిటి ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను నియమించాలని ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలని, ఈ సమస్యల పరిష్కారం కోసం నేడు డిపోల ముందు జరగబోయే ధర్నాలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శ్రీనివాస్ గీత మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాదాత కోటేశ్వర్‌రెడ్డికి ఘన నివాళి

**సికింద్రాబాద్, నవంబర్ 18 ప్రభాతవార్త:** వేలాధి మందికి ఉచితంగా విద్యనందించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు వట్టిపల్లి కోటేశ్వర్‌రెడ్డి అని పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు కొనియాడారు. సీతాఫల్‌మండి చౌరస్తా వద్దగల అమరావతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ వట్టిపల్లి కోటేశ్వర్‌రెడ్డి విగ్రహానికి 11వ వర్థంతి సందర్భంగా పూల మాలలు వేసి ఘంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజులు కట్టందే పాఠశాల గేటులోపలికి కూడా రానివ్వని పర్థితుల్లో వట్టిపల్లి కోటేశ్వర్‌రెడ్డి వేలాధి మందికి ఉచితంగా విద్యను అందించడం వల్ల వందలాధి మంది ప్రస్తుతం విదేశాల్లో గౌరవప్రదమైన స్థానాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారని తెలిపారు. విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఇండియాకు వచ్చిన పక్షంలో తప్పకుండా సీతాఫల్‌మండిలోని వట్టిపల్లి కోటేశ్వర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించడం మాత్రం మర్చిపోరని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోతే స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పిల్లను పాఠశాలకు తీసుకువచ్చేవారని అన్నారు. అలాంటి మహానుభావుడు మనమధ్య లేకపోవడం బాధగా ఉన్న లక్షలాదిమంది మదిలో మాత్రం ఎప్పుడూ ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, అమరావతి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషి చేస్తా : మీసాల ఎల్లేశ



దళిత జర్నలిస్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకపత్రాన్ని తీసుకుంటున్న మీసాల ఎల్లేశ్

**కంటోన్మెంట్,నవంబర్ 18 ప్రభాతవార్త:** దళిత జర్నలిస్టుల హక్కులు, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల ఎల్లేశ్ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించినట్లు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కాశ పోగు జాన్, ఏపి అధ్యక్షుడు డేవిడ్ రాజులు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం నాయకులు పెద్ది స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి అధికారుల తీరుకు నిరసనగా ధర్నా..

-బాధ్యులైన అధికారలపై చర్యలు తీసుకోవాలి..

-ప్రజా సమస్యలు పట్టించుకోని జలమండలి అధికారులు..



జలమండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ప్రజలు

**పేట్ బషీరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త**

జీడిమెట్ల పరిధిలోని ఎంఎన్‌రెడ్డి కాలనీ ఫేస్ 1లో గత కొద్ది నెలలుగా మంజీరా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ విషయంపైన జలమండలి అధికారులకు పలుమార్లు విన్నవించినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయంపైన సోమవారం ఎంఎన్ రెడ్డి కాలనీ ఫేస్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు అందరూ కలలిసి హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి అధికారుల తీరుకు నిరసనగా కాలనీ వాసులతో పెద్ద ఎత్తున ఐడిపిఎల్‌లోని జలమండలి కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు అధికారులు నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎన్ రెడ్డి కాలనీ ఫేస్1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంతప్ గౌడ్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా మా కాలనీలో నీటి సరఫరా సరిగ్గా జరగడంలేదని, నీటి ప్రెషర్ తక్కువగా ఉందని పలుమార్లు సమాచారం ఇచ్చినా కూడా అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తు జలమండలి కార్యాలయం ముందు మరోసారి ధర్నా చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొనన సమస్యలను అధ్యక్షులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు జలమండలి అధికారులు స్పందించి త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంపత్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, విజయ్ కుమార్, సత్యారామ్, రవి ముదిరాజ్, మునీశ్వర్, రామాంజనేయులు, రమేష్, మల్లాద్రి, రాజు, రాము, చందు, ప్రియ ప్రసాద్, కాశీనాథ్, రాజిరెడ్డి, సందీప్, నాగరాజు, సుధీర్, రమేష్, శంకరన్న, హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తా : రామక్రిష్ణ



6వ వార్డు నందమూరి నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 18 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని నెలకొన్న సమస్యలు దశల వారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. బస్తీబాట, బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం 6వ వార్డులోని నందమూరి నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు అజయ్, ప్రతీక్ జైన్,రవిందర్ రెడ్డి, బాబురావ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌ను అభినందించిన ఎసిపి శంకర్ రాజు



ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓబులేశ్‌ను అభినందిస్తున్న శంకర్ రాజు తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 18 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ సరోజినీ దేవి రోడ్డు అదర్శ కళాశాల వద్ద మతిస్థిమితం లేని 4 యేండ్ల బాలుడు అదృశ్యమైయ్యాడు. ఒంటరిగా ఉన్న ఆ బాలుడిని గుర్తించి గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఓబులేశ్ గుర్తించి వెస్ట్ మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న వారి తల్లిదండ్రులకు అప్పగించి తన నిబద్ధతను చాటుకున్నారు. విషయం తెలుసుకున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు కానిస్టేబుల్ ఓబులేశ్‌ను అభినందించారు. గతంలో కూడా 3 వేల నగదు, సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న బాధితురాలుకు నిజాయితీగా అప్పగించినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కాంగ్రెస్ నేతల అభినందనలు



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు నరేశ్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 18 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.303 కోట్లు నిధులు మంజూరు చేయించి నందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌ను 2వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేశ్, బాల్‌రాజ్‌లు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఫీక్, శ్రీను, శంకర్, మూర్తి, సాగర్, సూర్య, శివ,నజీర్, అంజనేయులు,రసీద్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్రత్ ఆలీ మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు : ఎమ్మెల్యే కెపి వివేకానంద



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**జగద్గిరిగుట్ట, నవంబర్ 18, ప్రభాతవార్త**

126 జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హజరత్ అలీ జ్ఞాపకార్థం ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫతేహా చెహ్లుం సంతాప సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిత్యం ప్రజా ప్రతినిధుల దృష్టికి తెచ్చి సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాడిన సీనియర్ నాయకులు హజరత్ ఆలీ మరణం వారి కుటుంబ సభ్యులకే కాదు బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని, బీఆర్ఎస్ పార్టీ వారి కుటుంబ సభ్యులకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా హజరత్ అలీ జ్ఞాపకార్థం కురాన్‌లోని పవిత్ర ప్రవచనాలను ముద్రిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేణు యాదవ్, జైహింద్, సయ్యద్ రషీద్, పాషాభాయ్, సల్మాన్, షేక్ ఖాదర్, చంద్రశేఖర్, యాదగిరి, సయ్యద్ ముంతాజ్ అలీ, సయ్యద్ ఇంతియాజ్, సయ్యద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## గీతా జయంతి సందర్భంగా భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

**సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 11వ తేదీన గీతా జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నామని సమితి తెలిపింది. ఇందులో భాగంగా డిసెంబరు 9వ తేదీన హిమాయత్‌నగర్‌లోని టిటిడి కళ్యాణ మండపంలో, నవంబరు 23వ తేదీన కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయంలో, డిసెంబరు 2న వికరాబాద్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో, డిసెంబరు 7 సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని టిటిడి సహాయ కార్య నిర్వాహణాధికారి చతుర్వేదల సత్యనారాయణ, ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి, ప్రోగ్రాం అసిస్టెంట్ గూడూరు హరినాథ్ తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగంపైన పోటీలు నిర్వహించబడతాయని, అలాగే 6,7 తరగతుల విద్యార్థులను మొదటి గ్రూపుగా, 8, 9 తరగతుల విద్యార్థులను రెండోవ గ్రూపుగా, ఆదే విధంగా సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకములు 18 సంవత్సరాల లోపు వారికి 3వ గ్రూపుగా, 18 సంవత్సరాలు పైబడిన వారిని 4వ గ్రూపుగా ఈ పోటీలలో విభజించడం జరుగుతుందని చెప్పారు. ఈ పోటీలలో ప్రతి పాఠశాల నుంచి ఒక గ్రూపుకు మించకుండా పంపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని, తల్లిదండ్రలకు వారు విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9030850336కు ఫోన్ చేయాలని వారు కోరారు.

## మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న హింస

23, 24 తేదీలలో జరిగే కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయాలి




కటౌట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌పావని

**సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** దేశంలో రోజురోజుకు మహిళలపై దాడులు, హింస పెరిగిపోతున్నదని, వీటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్‌పావని ఆరోపించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా సోమవారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కటౌట్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలపై హింసను ప్రేరేపించే సినిమాల విషయంలో చూసి చూడనట్లుగా ప్రభుత్వం ఉంటున్నదని, మహిళా రిజర్వేషన్ల కోసం తీసుకువచ్చిన చట్టంలో ఆనేక షరతులతో కూడి ఉన్నాయని, ఆ షరతులను తొలగించి రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయడానికి కావాల్సిన విధానపరమైన నిర్ణయాలను తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ నెల 23, 24 తేదీలో జరిగే సమాఖ్య తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరు జ్యోతి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, నాయకురాళ్ళు సక్రికబాయి, వాణి, పద్మ, శ్యామల, హారతి, కమలమ్మ, అంజుమ్, జ్యోతిశ్రీమాన్, సారా, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా క్రీడా వారోత్సవాలు



సర్టిఫికెట్లను తీసుకుంటున్న చిన్నారులు

**నాచారం నవంబర్ 18 ప్రభాతవార్త:**

పల్లవి అంతర్జాతీయ స్కూల్లో స్పోర్ట్స్ అండ్ స్టేట్స్ అనిర్వేద క్రీడా వారోత్సవాల ముగింపు వేడుక సంబురంగా జరిగింది. ఈ సందర్భంగా నేత్ర పేరుతో సృజనాత్మక కళాకృతుల ప్రదర్శన అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్కూలో ప్రదానోపాధ్యాయురాలు హేమ మద బుషి సంవత్సరాంతం జరిగిన వివిద కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్లవి విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వీ, తెలంగాణ స్విమ్మింగ్‌అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేకర్ రెడ్డి, గౌరవ అతిథులుగా అభిలాష అనీష్ పాల్గొని క్రీడల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీఈవో యసస్వీ మాట్లాడుతూ విద్యార్థుల కృషితో పాటు తమ ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కరికి క్రీడలు ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడలో ప్రతిభకనబర్చిన వారికి బహుమతులను, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కళాకృతులు, హస్తకళ, చిత్రకళ, శిల్పకళ, రంగుల అద్దకం, చేనేత తయారీ వంటి ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వివిద సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపప్రధానోపాధ్యాయురాలు మీనుతో పాటు ఉపాధ్యాలు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్,జూబ్లీహిల్స్‌లలో ఎక్కుపెట్టిన లేజర్ గన్..

-మితిమీరిన వేగంతో వెళ్ళే వాహనదారులపై పోలీసుల కొరఢా

-అతివేగం ఎపుడూ ప్రమాదమే..

పశ్చిమ మండలం ఎసిపి కట్టా హరిప్రసాద్..

**పంజగుట్ట, నవంబర్ 18 (ప్రభాతవార్త):**

మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలబారిన పడడమే కాకుండా పక్కవవారికి కూడా ఇబ్బందులు తలెత్తుతాయని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లతో పాటు పశ్చిమ మండలంలోని పలు ప్రాంతాలలో రహదారులపై రయ్ రయ్ మంటూ మితిమీరిన వేగంతో దూసుకెళుతున్న వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు లేజర్ గన్‌తో చెక్ పెడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పూర్తిగా గాలికొదిలేసి అదుపుతప్పిన వేగంతో దూసుకెళుతున్న వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏసీపీ హెచ్చరించారు.లేజర్‌గన్ ద్వారా స్పీడ్ లిమిట్ దాటిన వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. ఈమధ్యకాలంలో ప్రధాన రహదారులపై అతివేగంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వీటిని అదుపు చేసేందుకు రోడ్డుపక్కన సీక్రెట్‌గా స్పీడ్‌ను నమోదు చేస్తూ హద్దులు దాటిన వారిని గుర్తిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డునంబర్ 2లోని కేబీఆర్ పార్క్ చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్ళే రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు లేజర్‌గన్‌ను ఏర్పాటు చేశారు. నవంబర్ 1 నుంచి స్పీడ్‌లిమిట్ దాటిన వారిని గుర్తించి ఛలాన్‌లను విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ రోడ్డు స్పీడ్ లిమిట్ 70 కు మించరాదని నిబంధనలు విధించారు.ఈ నెలలో ఇప్పటివరకు నిబంధనలు అతిక్రమించి అతివేగంతో వాహనాలను నడిపిన 1324 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు.ఒక్కొకరికి 1000 రూపాయల మేర జరిమానాలు విధించడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఏతా వాతా గమనిస్తే రోజులో వందకు పైగానే వాహనదారులు నిబంధనలకు వ్యతిరేకంగా అతివేగంతో వాహనాలు నడుపుతున్నారని పోలీసులు గుర్తించారు.అతివేగం ఎప్పటికీ అనర్ధమేనని, మితిమీరిన వేగంతో వెళ్ళడం వలన కూడళ్ళ నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ అన్నారు. సాధారణ సమయాలలో కంటే ఉదయం వేళలలో ఆయా ప్రాంతాలలో రోడ్లపై వాకింగ్‌కు వచ్చే వారు ఉంటారని, వారిలో వృద్ధులు, మహిళలు కూడా ఉంటారని మితిమీరిన వేగం వల్ల వారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మితిమీరిన వేగంతో ప్రమాదాలు జరిగితే వాహనదారుల కుటుంబాలు తల్లడిల్లిపోతాయని, ఒక్కసారి కుటుంబ సభ్యులను ఊహించుకుని వాహనాలను నడిపితే ప్రమాదాలు జరిగే ఆస్కారమే లేదన్నారు. ఎవరికి వారు స్వయం నియమావళితో క్రమశిక్షణతో, నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపడం అలవర్చుకోవాలన్నారు.

## మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు : అడిషినల్ ఎస్పి లక్ష్మి

**దుండిగల్, నవంబర్ 18 ప్రభాతవార్త:**

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఎమ్మెల్లార్‌ఐటిఎం) కళాశాలలో సోమవారం వర్క్ కల్చర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి అడిషినల్ ఎస్పి లక్ష్మీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. షీటీమ్ పని విధానం, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ అంశాలపై వివరంగా తెలియజేశారు. టిసేఫ్ యాప్‌ను మహిళలు తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. యాప్ ద్వారా ప్రయాణ సమయంలో పర్యవేక్షణ, భద్రత నిర్ధారణ కోసం సమాచార సేకరణ, లైవ్‌లోకేషన్ షేరింగ్, ప్రయాణ సమయంలో మార్పులను పసిగట్టి పోలీసులను అప్రమత్తం చేస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే షీటీమ్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎమ్మెల్లార్ గ్రూప్స్ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామన్నారు. తద్వారా మహిళలు వారి హక్కులు, భద్రత విషయాలు, పనిపట్ల అవగాహనతో అభద్రత లేకుండా ముందుకు సాగుతారని పేర్కొన్నారు.

అనంతరం అతిథులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం లో డిఎస్పి శంకర్, ఐక్యూఎసి నిర్వాహకులు చైతన్య, హేమ లత, డా.వినోద్, డా.వరలక్ష్మీ, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రెండవ ఎఎన్ఎంలను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి




మహాసభలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మా

**సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:**

ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఎఎన్ఎంల నోటిఫికేషన్‌లో 1931 పోస్టులకు మరో 3 వేలకు పెంచి వయసు మీరి పరీక్ష రాయడానికి అర్హత లేని వారికి 100 శాతం గ్రాస్ శాలరీతో పాటు పదవి విరమణ సమయంలో 10 లక్షల రూపాయలు లైఫ్ గ్రాడ్యూటి చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెండోవ ఎఎన్ఎంల యూనియన్ ప్రథమ మహా సభలో ఆయన ప్రసంగించారు. ఈ మహాసభకు నాయకు రాళ్ల జక్కుల పద్మ, బోయిని శ్యామల అధ్యక్షత వహించా రు. ఈ సందర్భంగా ఎం.నర్సింహ్మా ప్రథమ మహాసభలో ఎన్నికైన నూతన కమిటీని ప్రకటించారు. రెండోవ ఎఎన్ఎంల సమస్యలను పరిష్కారించాలని, వారిని బేషరుతుగా రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఏడాది ఎఎన్ఎంలు నిరవధికంగా సమ్మె చేస్తున్న సమయంలో ప్రభుత్వం ఆనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదని ఆరో పించారు. సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళితే మూడు నెలలు సమయం కావాలన్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత 17 సంవత్సరాలుగా ఆనేక ఇబ్బందులకు గురవుతూ పనిచేస్తున్న రెండోవ ఎఎన్ ఎంల పరీక్షలలో తొలి అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. తక్షణమే రెండోవ ఎఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, లేని పక్షంలో 5 వేల పోస్టులను మంజూరు చేసి నియామకాలను చేపట్టాలని ఆయన కోరారు.

తెలంగాణ రాష్ట్ర రెండోవ ఎఎన్ఎంల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా తోట రామాంజనేయులు, అధ్యక్షు రాలిగా జక్కుల పద్మ, ప్రధాన కార్యదర్శిగా బోయిని శ్యామల, కోశాధికారిగా రాజేశ్వరి ఎన్నికైనారు.

## నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు

-అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసిన సంఘం నేతలు


**ముషీరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:**

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు తమకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని 15 రోజులలో అమలుచేయకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నామని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నేతలు తెలిపారు. సోమవారం వారు అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధారెడ్డిని కలసి సమ్మె నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం హనుమకొండలో సమగ్రశిక్ష ఉద్యోగులను కలిసిన రేవంత్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రాగానే నెలలోగా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంతవరకు సమగ్రశిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 126 మంది ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేకపోవటం విచారకరమని అన్నారు. ప్రభుత్వం మా గోస పట్టించుకోని కారణంగా సమ్మెకు వెళ్లక తప్పటం లేదని స్పష్టం చేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో టీఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి జాన్సీ సౌజన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌చారి, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, మహిళా సెక్రటరీ అమృత ఉన్నారు.



సమ్మె నోటీసు అందచేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నేతలు

## టిటిడి బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తికి సన్మానం




జంగాకృష్ణమూర్తిని సన్మానిస్తున్న మార్తరమేష్, కృష్ణయాదవ్, జూలూరి గౌరిశంకర్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త:**

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన జంగా కృష్ణమూర్తి యాదవ్‌ను తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మార్త రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. లిబర్టిలోని తితిదే దేవస్థానంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా మార్తరమేష్ మాట్లాడుతూ దేవదేవుడు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లకాలం ఉండాలని కోరుకున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. గోపాల్ యాదవ్, అఖిల భారత యాదవ్ మహాసభ నాయకులు, ఎం. బి. కృష్ణ యాదవ్, జూలూరి గౌరీ శంకర్,చ హనుమాన్ కేసరి గౌడ్ , ఎం. వి. ఎస్. నికేతన్ కుమార్ ,నోబుల్ సురేష్ యాదవ్, వెంకట్ యాదవ్ తదితరులు పేర్కొన్నారు.

## ప్రజాసమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టికోవడం లేదు



బస్తీ బాటలో స్థానిక వ్యాపారులను అడిగి తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్

**గోషామహల్,నవంబర్ 18ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అటు అధికారులు,ఇటు ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ అన్నారు.ఈమేరకు సోమవారం బేగంబజార్ డివిజన్ పరిధిలో బస్తీ బాట కార్యక్రమంలోభాగంగా బేగంబజార్ డివిజన్‌లో స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూడివిజన్ పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సిసి రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రశ్నించారు.బేగంబజార్ చేపలమార్కెట్ వద్ద కొత్త రోడ్డు వేసేందుకుగాను తవ్వినరోడ్డుపై సిసి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టక పోవడంతో స్థానిక వ్యాపారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు.అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తానన్నారు.బస్తీబాటలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

